క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కోట: వైఎస్సార్‌సీపీ నాయకుడు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి సోదరుడు నిరంజన్‌రెడ్డి(73) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్, దువ్వూరు రమణారెడ్డి, పాదర్తి రాధాక్రిష్ణారెడ్డి, రఘురామిరెడ్డి కొక్కుపాడు చేరుకున్నారు. నిరంజన్‌రెడ్డి భౌతిక దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డిని పరామర్శించారు.

ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బాలాయపల్లి(సైదాపురం) : ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని బాలాయపల్లి, డక్కిలి పీహెచ్‌సీల వైద్యాధికారులు లియోనా, బిందుప్రియాంక తెలిపారు. బాలాయపల్లి, డక్కిలి పీహెచ్‌సీల్లో గురువరం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్టు తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. నలభై ఏళ్ల దాటిన మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ నెల 26న అలిమిలి, నిడిగల్లు, 29వ తేదీన గొట్టికాడు, నిండలి గ్రామాల్లో వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, చైతన్యభాను, సర్పంచ్ మురళీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

15 కుటుంబాలకు చేయూత



సరుకులు, నగదు అందజేస్తున్న దాతలు

వాకాడు : మండలంలోని పట్టాభిరామాలయంలో గురువారం 15 మంది పేద పురోహితుల కుటుంబాలకు శ్రీరామసేన ఆధ్వర్యంలో దాతలు ఫల సరుకులు, కూరగాయలు, నగదు అందజేశారు. కొడవలూరు రాధాకృష్ణారెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పుట్టంరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, అనురాధమ్మ చేయూత ఇచ్చారు. కార్యక్రమంలో శివ, సాయిబాబు, పవన్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిల్లకూరు : గూడూరు డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నిర్వాహకులు మాట్లాడుతూ పేదలకు కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారికి తిరుపతిలో ఆపరేషన్‌లు చేయిస్తామన్నారు. ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామని తెలిపారు. ట్రస్టు ఏవో క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



మొక్కలు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చిల్లకూరు : ప్రపంచంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అదానీ క్రిష్ణపట్నం పోర్టుకు చెందిన అదానీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ ప్రతినిధి రాకేష్‌రంజన్ తెలిపారు. తమ్మినపట్నం పంచాయతీలో గురువారం గ్రామ పంచాయతీ భాగస్వామ్యంతో ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి అన్న అంశంపై అంతర్జాతీయ వైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి మీద కాలుష్యం ఎక్కువ కావడం వల్ల సమతుల్యత లోపించడంతోపాటు ఓజోన్ పొర దెబ్బతింటుందన్నారు. తద్వారా అన్ని రకాల ప్రాణులకు నష్టం కలుగుతుందని వివరించారు. సముద్ర జలాలు కాలుష్యం కావడం వల్ల జలచరాలతో పాటు మత్స్యకారులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వీటిని నిలవరించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. ఇందులో భాగంగానే అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తీరు ప్రాంత గ్రామాల్లో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మత్స్యకార కాపులు బక్తాని రామయ్య, మేకల వెంకయ్య, కోట సతీష్ పాల్గొన్నారు.



కొత్తపల్లి సమీపంలో స్వరూపం కోల్పోయిన కన్నాకాలువ



కుప్పారెడ్డిపాళెం సమీపంలో శిథిలావస్థకు చేరిన పాలకాలువపైనున్న చెక్‌డ్యామ్



నెర్రికాలువలో చేపట్టిన సీసీ వాల్ నిర్మాణ పనులు (ఫైల్)

కనుమరుగవుతున్న కాలువలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంది. దొరవారిసత్రం మండలంలోని కన్నాకాలువ, పాలకాలువ, నెర్రికాలువల అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు చేసింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనుల గురించి పట్టించుకోలేదు. మంజూరైన నిధులను కూడా విడుదల చేయలేదు. దీంతో కాలువలు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. తద్వారా చెరువుల్లోకి నీరు చేరే అవకాశం ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- వర్షం వస్తే చెరువులకు నీరు చేరదని రైతుల ఆందోళన
- కాలువలను బాగు చేయాలని వేడుకోలు



అయ్యపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో దుస్థితిలో వున్న నెర్రికాలువ

దొరవారిసత్రం : నాయుడుపేట మండలం పూడేరు ప్రాంతంలో ప్రారంభమయ్యే కన్నాకాలువ దొరవారిసత్రం మండలం రామరెడ్డికండ్రిగ, కొత్తపల్లి, పూలతోట, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, చవటకండ్రిగ, కట్టువాలపల్లి గ్రామాల వరకు 12 కిమీటర్లు విస్తరించి ఉంది. దీని కింద రెండు మండలాల్లో 4000 ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. అంతేగాక 25 చెరువుల్లోకి నీరు చేరుతుంది. ప్రస్తుతం ఈ కాలువ స్వరూపాన్ని కోల్పోయింది. అదేవిధంగా వెదురుపట్టు, వేణుంబాకం, ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం తదితర గ్రామాల చెరువులకు నీటిని అందించే పాలకాలువ పలు ప్రాంతాల్లో ముళ్ల చెట్లతో నిండిపోయింది. దీనిపై రెండు చోట్ల నిర్మించిన చెక్ డ్యామ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతినడంతో వర్షపు నీరు చెక్‌డ్యామ్‌లో నిలవకుండా వెళ్లిపోతోంది. ఈ కాలువ కింద 1000 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. దీన్ని బాగు చేయాలని 2015-16, 2016-17లో నీరు-చెట్టు పథకం కింద రెండు విడతల్లో రూ.కోటి మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న అప్పటి అధికార పార్టీ నేత తూతూ మంత్రంగా పనులు చేసి నిధులను స్వాహా చేశారు. అదే విధంగా మండలంలో 7 కిలోమీటర్లు ప్రవహిస్తే కన్నాకాలువ అభివృద్ధికి నీరు-చెట్టు కింద 2016-17లో రూ.50 లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు అరకొరగా పనులు చేసి నిధులను దోచేశారు.

నెర్రికాలువలో ఎక్కడి పనులు అక్కడే...

దొరవారిసత్రం మండలం తనియాలి సమీపంలోని కాళంగి నది నుంచి ప్రారంభమయ్యే నెర్రికాలువ వివిధ గ్రామాల మీదుగా ప్రవహిస్తూ సూళ్లూరుపేట, తడ మండలంలోని కారిజాత వరకు 17.5 కిలో మీటర్లు విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా 17 చెరువులకు నీరు చేరుతుంది. 15 వేలు ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువలో బోర్లు, మోటార్లు వేసుకుని రైతులు 1000 ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. దీని అభివృద్ధి కోసం 2022-23లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.28.2 కోట్లు మంజూరు చేసింది. వీటితో కాంక్రీట్‌తో సీసీ వాల్, కాలువ అడుగున బెడ్ పనులు చేపట్టారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి.

కాలువను అభివృద్ధి చేయాలి



పలు ప్రాంతాల్లో విస్తరించిన కన్నాకాలువ అభివృద్ధికి నిధులు కేటాయించాలి. ఈ కాలువ కింద వందలాది మంది రైతులు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. పలు చెరువులకు నీరు చేరుతుంది. కాలువ పూడిపోవడంతో వర్షాలు కురిసినా చెరువుల్లోకి నీరు చేరడం లేదు.

- ఎం సుబ్రమణ్యం, చవటకండ్రిగ

నెర్రికాలువను బాగు చేయాలి



డీవీ సత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల రైతులకు మేలు చేసే నెర్రికాలువ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో కొంత వరకు పనులు చేశారు. ప్రస్తుతం పనులు ఆగిపోయాయి. మిగిలిన పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలి.

- అల్లూరు రాహుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, డీవీ సత్రం

రూ.2.50 కోట్ల బిల్లులు చెల్లించాము

నెర్రికాలువ ప్రారంభమైన చోట కాలువలో సీసీ వాల్ నిర్మాణం, బెక్ పనులు చేపట్టాము. ఇందుకు కాంట్రాక్టర్‌కు గతంలోనే రూ.2.50 కోట్ల వరకు బిల్లులు చెల్లించాము. మిగిలిన పనులకు నిధులు ఉన్నాయి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో మాట్లాడి పనులు చేసేలా చర్యలు చేపడతాం.

- రమేష్, ఏఈ, ఇరిగేషన్ శాఖ, డీవీ సత్రం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు

చిల్లకూరు : వెట్టి చాకిరీ చేయించుకుని బాధించడంతో గూడూరు మండలం నెలటూరు చవట గిరిజన కాలనీకి చెందిన బాలుడు మృతి చెందాడని, వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు కోరారు. వారు గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చవట గిరిజన కాలనికి చెందిన అంకమ్మ, చెంచయ్య దంపతులు తమ కుమారుడు (9)ని సత్యవేడు ప్రాంతంలోని బాతుల వ్యాపారి వద్ద పనిలో పెట్టారని తెలిపారు. అక్కడ ఏమి జరిగిందో కాని ఏప్రిల్ 12న బాలుడు మృతి చెందాడని తెలిపారు. మృతదేహానికి అక్కడే అంత్యక్రియలు చేశారని తెలిపారు. దీనిపై బాలుడి తల్లి సత్యవేడు పోలీసులకు ఫిర్యాదు చేయగా నాలుగు రోజుల క్రితం సత్యవేడు పోలీసులు విచారణ చేపట్టి బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారని తెలిపారు. కొడుకును కోల్పోయిన దంపతులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కమిటీ సభ్యులు అరవ పార్వతయ్య, ఏసుపాక పెంచలయ్య, దాసరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందాం'

ఓజిలి: చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందామని ఈవోపీఆర్డీ ఎం.రేణుక తెలిపారు. ఆమె గురువారం గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వచ్చిన మూడు చక్రాల సైకిళ్లను సర్పంచులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ 26 పంచాయతీల్లోని చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తతో వర్మీకంపోస్టు తయారుచేయాలన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపాళెం, చిలమానుచేను, పెదపరియ, భువనగిరిపాళెం, కర్రబల్లవోలు, సగుటూరు, రాచపాళెం, మనవాలి గ్రామాలకు అందించేందుకు గాను ఒక్కో చెత్త బండి రూ.27 వేలు వెచ్చించి కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. పంచాయతీలో ఇద్దరు పారిశుధ్య కార్మికులను నియమించుకుని చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరి లలితమ్మ, వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం వాసి మృతిపై ముమ్మర దర్యాప్తు

నాయుడుపేట టౌన్ : శ్రీకాకుళానికి చెందిన పి.గణేష్ కుమార్ ఈ నెల 18వ తేదీన నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడు నగర్‌లో నివాసముంటూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. గణేష్ కుమార్ ఇంటి వద్ద ఈ నెల 18వ తేదీ రాత్రి కింద పడి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు మృతుడి భార్య అమృత అలియాస్ కనకదుర్గ పోలీసులకు తెలిపింది. కుమారుడి మృతిపై పలు అనుమానాలు వున్నాయని అతని తండ్రి పి.నరసింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కోడలితో కలిసి నెల్లూరుకు చెందిన వ్యక్తి మూడు రోజుల నుంచి ఉంటున్నాడని తెలిపారు. ఆదివారం రాత్రి గణేష్‌కుమార్‌కు అతిగా మద్యం తాగించి పథకం ప్రకారం హత్య చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతుడి భార్య అమృతతో పాటు అమె స్నేహితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని, పలు ఆవయావలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు.

తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు పంచాయతీ సర్వే నంబర్లు 6, 9, 416లో 22.49 ఎకరాల్లో మెస్సర్స్ దమ్ము బయోఫ్యూయల్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ నిర్మాణం కోసం గురువారం అధికారులు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను తూతూ మంత్రంగా చేపట్టారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ పాలక వర్గానికి సమాచారం లేకపోవడంతో ముగ్గురు నలుగురు గ్రామస్తులు మాత్రమే వచ్చారు. ఆమె మాట్లాడుతూ కంపెనీలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అన్ని చర్యలూ చేపడతామన్నారు. కంపెనీ మేనేజర్ దమ్ము కిశోర్‌బాబు మాట్లాడుతూ పాలచ్చూరు గ్రామాభివృద్ధి కోసం పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆందోళనకు దిగిన ఎన్జీవోలు

కంపెనీ ఏర్పాటుపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణకు వివిధ ప్రాంతాలకు చెందిన ఎన్జీవోలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారికి కనీస వసతులు కల్పించకపోవడంతో పాటు టీఏ, డీఏలు చెల్లించకపోవడంతో ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పరిశ్రమ ప్రతినిధులు ఎన్జీవోలతో మాట్లాడి సర్దుబాటు చేసుకున్నట్లు సమాచారం. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, పీఆర్వో గ్రేస్‌రాజా, తహసీల్దార్ ద్వారకనాథ్ రెడ్డి, వీఆర్వోలు మొబీనా, శ్రీనివాసులు, సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు, నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, పెళ్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు సతీష్‌రెడ్డి, సర్వేయర్ సూర్య పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వసతులు కల్పించాలి



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిట్టమూరు : వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు తగిన వసతులతోపాటు మంచిగా చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌తో కలిసి చిట్టమూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మరమ్మతు పనులను పరిశీలించారు. అక్కడి వసలతుపై ఆరా తీశారు. మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో పిల్లలు పక్కనే ఉన్న పొలాల్లోకి బహిర్భూమికి వెళుతున్నట్లు గుర్తించి వార్డెన్ సాల్మన్‌రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను బాగు చేయించాలని ఆదేశించారు. లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలకు మెనూ ప్రకారం మంచి భోజనం పెట్టాలన్నారు. పనులు నాణ్యంగా ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్ కుమార్, ఏఎస్ డబ్ల్యూ మనోజ్, ఈఈ బాలసుబ్రమణ్యం రెడ్డి, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చినబలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 42.490 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 42.490 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,250, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

కోట: మైనార్టీల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందని ఎంపీడీవో దిలీప్‌కుమార్ తెలిపారు. కోట మండలానికి 18 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

సైదాపురం: మండలంలోని 1, 2 ఆప్షన్‌లో ఉన్న లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి జూన్ మొదటి వారంలో ప్రారంభోత్సవం చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఫీల్డ్ వెరిఫికేషన్ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు బిల్లులు జనరేట్ చేయాలన్నారు. ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నామని తెలిపారు. హౌసింగ్ డీఈఈ జహీరుద్దీన్ పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ చికెన్ వ్యర్థాలు వేస్తే చర్యలు

చిట్టమూరు : చికెన్ షాపుల వారు ఎక్కడ పడితే అక్కడ చికెన్ వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మనోహర్ గౌడ్ హెచ్చరించారు. ఆయన గురువారం కొత్తగుంటలో ఉన్న చికెన్ షాపుల యజమానులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాలను మల్లాం-నాయుడుపేట రోడ్డు పక్కనే వేస్తున్నారని తెలిపారు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇకపై వ్యర్థాలను సూచించిన చోటే డంప్ చేయాలని, ఎక్కడ పడితే అక్కడ వేస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నాయుడుపేట టౌన్ : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని కళాకారులు తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో కళాకారులు గురువారం నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులతో కలిసి నాయుడుపేటలో అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ, ఓఆర్‌డబ్ల్యూ శ్రావణి, సాయిలక్ష్మీ, ఏఎన్ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



రాపూరు : మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లా మాధవరానికి చెందిన రాజు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెమ్మ దంపతులు రూ.2,05,121లు విరాళం ఇచ్చినట్టు ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వారికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్టు పేర్కొన్నారు.

ఖాదర్ షావలీ ఉరుసు నిషాన్ జెండా ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని హజరత్ ఖాదర్ షావలీ చిన్న దర్గా ఉరుసును ఈ నెల 29, 30 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి నిషాన్ జెండాను ఆవిష్కరించారు. దర్గాలో ప్రత్యేక పాతేహాలు నిర్వహించారు. నిషాన్ జెండాకు శ్రీవారి గంధం లేపనం చేసి దర్గా వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు చాన్‌బాష, శేఖర్, షేక్ రియాజ్, నీలిశెట్టి మహేంద్ర, వంశీ, చంద్రశేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



గూడూరులో హనుమజ్జయంతి వేడుకలు



వెంకటగిరి పట్టణంలో శోభాయాత్ర



సైదాపురంలో విశేషాలంకరణలో ఆంజనేయస్వామి



ఓజిలి : బండారుగుంటలో ఆంజనేయస్వామికి పూజలు

వెంకటగిరి రూరల్/సైదాపురం/ఓజిలి/నాయుడుపేట టౌన్/కోట/రాపూరు/చిల్లకూరు/చిట్టమూరు : వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో గురువారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు.




రాపూరు : పెంచలకోనలో ఆంజనేయస్వామికి క్షేత్రోత్సవం



కోటలో హనుమాన్ శోభాయాత్ర



నాయుడుపేటలో ఊరేగింపు



చిట్టమూరు: రాఘవవారిపాలెంలో...

దాడి కేసులో ముగ్గురి అరెస్టు

చిల్లకూరు : మండలంలోని బల్లవోలు గ్రామంలో నాలుగు రోజుల క్రితం మద్యం మత్తులో వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారు గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. బల్లవోలు గ్రామానికి చెందిన రాయపు గౌతమ్ మరికొంతమందితో కలిసి కాకువారిపాళెంకు చెందిన శీను అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి గౌతమ్‌తోపాటు సంతోష్, మనీష్ అనే యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు పోలీసులు తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని వెల్లడించారు.